


# ముక్కులందు పుణ్యముక్కులు వేరయా!

ఎట్ట పుట్టిందో ఏమోగానీ మా ఇశ్వోదయా తురాయి చెట్ల కింద సైగ్గా ఒక పుకారు పుట్టేసింది. అది ఏమి పుకారో చెప్పే ముందర మా ఇస్కూల్లో తురాయి చెట్ల సంగతి కొంత.

మా కుమారస్వామి ఐవోరు మా ఇస్కూల్లో జెప్పేది ఇంగ్లీషు పాఠాలే అయినా, సోషలు పాఠాలు చెప్పకపోయినా అశోకుడి మాడల్‌లో మా ఇస్కూలు గ్రౌండులో చాలా కాలానికి ముందరే వరుసగా తురాయి చెట్లు నాటిపిచ్చి ఉన్నాడు.

నేను చేరేనాటికి అయి నేను మూడుసార్లు నిలబడితే ఎంత ఎత్తు ఉంటానో అంత ఎత్తుకి ఎదిగి ఉన్నాయి. రోజూ పొద్దున్నే మేము బడికెళ్లే పాటికల్లా అయి చెట్ల నిండుగా పూలు పూసి నేల నిండుగా ఎర్రగా రెక్కలు రాల్చి ఉంటాయి.

కిలాసులు మొదులుగావడానికి ముందు, మద్యానాలు, సాయంత్రాలు మా పిలకాయలకి ఆ తురాయిచెట్లే తోడు. మేము ఆడ జేరి ఆ మాటలూ ఈ మాటలూ మాట్లాడుకుంటా చెట్ల మీద ఉండే ఆ పూలరెక్కలని పుల్లపుల్లగా తియ్య తియ్యగా తుంచుకొని

తింటా, వాటి పచ్చి మొగ్గల్లో ఉండే కొండెలతో కోడిపందాలు ఆడుకుంటా కాలక్షేపం చేస్తా ఉంటాము. ఒక మంచైనా ఒక చెడ్డయినా అంతా ఆడే. ఆ రోజు మంచే అనుకున్నాముగానీ చూడబోతే అది చెడ్డయి కూర్చుంది. ఆ చెడ్డ పని చేసినవాడు అలహరి శ్రీనుగాడు. మొదట ఆ పుకారుని చెప్పింది వాడే.

'ఒరే. మా యిళ్లకాడ పిలకాయలు చెప్పుకుంటా ఉన్నారు. ముక్కు మీద వందసార్లు ఎంకటేశ్వరసామి నామం గీరుకుంటే ఆ రాత్రికి దేవుడు అవుపిస్తాడంటా. అందరూ చెప్పు కుంటా ఉన్నారు. నేను మొదలు నమ్మలా. మా యిళ్లకాడ బాస్కరు అని రెడ్ల పిల్లోడు నిన్న ఆ పని చేసినాడు. రాత్రికి వాడికి దేవుడు కనిపించినాడంట. వాడు అంతవరకే చెబుతున్నా డుగానీ వాడేమి అడిగాడు ఆ దేవుడేమి ఇచ్చాడనేది చెప్పడంలా. నేను అడిగితే కావా లంటే నువ్వు ట్రయి చేసుకో అని చెప్పాడు. అయితే ఈ పని చేసేముందు యిట్ట చేస్తున్నాం అని ఎవ్వరికీ చెప్పకూడదంట. మన బక్తి నలుగురికీ తెలియగూడదంట. ఈ పని సైగ్గా చేయాలంట' అన్నాడు అలహరి శ్రీనుగాడు.

అది విని కందుల మాలకొండరావుగాడికీ, కాండూరి మురళీగాడికీ ఆశ బుట్టింది. నాక్కూడా బుట్టిందిగానీ మేము సాయెబులంగదా. ఆ పని చేస్తే నాకు ఎంకటేశ్వరసామి అవుపిస్తాడో లేదో అని డౌటు వచ్చి ఆగిపోయాను.

'కాదురా. పైపైన గీరుకుంటే చాలా. బాగా గట్టిగా గీరుకోవాలా?' అని అడిగాడు కాండూరి మురళీగాడు.

'గట్టిగా గీరుకోవాలి నాయనా. దేవుడేమి తేరగా ఉన్నాడా. ముక్కు మీద నిలువుచార అట్టే కూచుండిపోవాల. అప్పుడు గదా దేవుడు మెచ్చి నీకు కనిపించేది. నువ్వు అడిగింది ఇచ్చేది. నేను ఇవాళ సాయంత్రం ఆ పని చేద్దామనుకుంటున్నా. అయితే ఒకటి. ఈ మాట ఎవ్వరికీ చెప్పబాకండి. అందరికీ ఒకేసారి దేవుడు కనిపించాలంటే అయ్యేపనేనా?' అన్నాడు అలహరి శ్రీనుగాడు.

'అందరి సంగతి ఏమోగానీ నాకు మాత్రం కనిపించాల్సిందే నాయనా. నాకు సుప్ర బాతం మొత్తం కంటతా వచ్చు. మా యింట్లో నేను పాడతా ఉంటే మా అమ్మా నాయనా మా జాంచెట్టు మీద ఉండే అక్షులు పక్షులు అన్ని కళ్లట్టే పెట్టి యింటాయి తెలుసా?' అన్నాడు మాలకొండరావుగాడు.

'ఏమో నాకదంతా తెలవదు. ఎవుడికెంత ప్రాప్తమో అంత. రేపు కలుద్దాం' అని ఎళ్లిపో యాడు అలహరిశ్రీను.

మాలకొండరావుగాడు, మురళీగాడు, నేను ఆ తర్వాత దారిపొడుగూతా మాటా పొలుకూ లేకుంటా యిళ్లకు జేరుకున్నాం.

ఆ రాత్రంతా నాకు నిద్దర లేదు.

యిళ్లిద్దరూ నామం గీరుకొని ఉంటారా, మచ్చ వాళ్ల ముక్కు మీద అట్టే కూచుండి పోయుంటుందా, ఆ తర్వాత దేవుడు ప్రత్యక్షమయ్యి 'ఏం కావాలిరా మాలకొండయ్యా, నీకేం కావాలమ్మా మురళీగా' అని అడిగి ఉంటాడా? అడిగితే ఈ నాయాళ్లిద్దరూ ఏమి కోరు కొని ఉంటారు... అని ఒకటే ఆలోచన.

మాలకొండరావుగాడి అరచేతులకి అరికాళ్లకి మాటిమాటికీ చెమటపడతా ఉంటుంది.

వాడు లబ్బరు చెప్పులు ఏసుకొని నడిస్తే కాలిముద్దర్లు అట్టే చెప్పుల మీద మట్టిమట్టిగా పడి అవుపిస్తాయి. అందుకని వాడు 'ఎంకటేశ్వరసామీ. ఈ చెమటబాద తప్పించవా' అని కోరుకొని ఉంటాడా?

మురళీగాడిది నాగుపాము తల. వాడు క్రాపు దువ్వుకుంటే ముందరి పక్క జుట్టు పడగ తన్నినట్టు తన్నతా ఉంటుంది. నూనెబెట్టి దువ్వినా, తాళ్లేసి కట్టినా అది అంతే. ఆ దిగులు పట్టలాక వాడు 'ఎంకటేశ్వరసామీ. నాకు ఎన్టీయారు క్రాపుగానీ, సోబన్‌బాబు రింగుక్రాపుగానీ యియ్యరాదా?' అని కోరుకొని ఉంటాడా?

నాకు నిద్దరే పట్టలా.

తెల్లారింది. బడికాడికి ఆత్రం ఆత్రంగా పోయేపాటికి మురళీ వాళ్ల తాత మురళీగాడి చేయి పట్టుకొని నేరుగా ఇస్కూలుకి వచ్చేసున్నాడు.

అసలే ఆయన ముక్కోపి. పైగా ఇంతెత్తు మనిషి. అదీగాక ఆయన మా ఊరి బృందా వనం- అంటే కృష్ణుడి గుడిలో పూజారి కాబట్టి ఎప్పుడు చూసినా ఒంటి మీదా పంచె మీదా కుంకుమ గుర్తులతో ఉగ్రంగా అవుపిస్తా ఉంటాడు.

ఆయన పక్కనే మురళీగాడు నిలబడి ఉన్నాడు. వాడి ముక్కు మీద పలాస్త్రీ వేసి ఉంది.

'ఏమయ్యా. కుమారసామీ. మీ ఇస్కూలికి పంపితే యిదంటయ్యా పిలకాయలని నేర్పి పంపతా ఉండేది. ముక్కు మీద వందసార్లు నామం గీరుకుంటే దేవుడు కనిపిస్తాడా? ఎవుడయ్యా మీకు చెప్పింది? నలబై ఏళ్లుగా క్రిష్ణుడి పాదాల కాడ నిలబడి పూజ చేస్తా ఉన్నా ఏనాడూ నా మనవడికి యిట్టాంటి మాటలు చెప్పలేదు గదయ్యా. మీ బళ్లో ఎందయ్యా ఈ మాటలు? ఎవుడయ్యా ఈ మాట చెప్పినవాడు' అని ఆయన మా కుమారస్వామి ఐవోరిని జాడించి వదిలిపెట్టినాడు.

మా కుమారస్వామి ఐవోరు తెల్లగా పొడుగ్గా చక్కటి గుడ్డలు కట్టుకొని అమితమైన దర్పంతో ఉంటాడు మనిషి. దేవుడు ఆయనకేమైనా లోటు చేశాడురా అనంటే అది బట్ట తలే. ఎంట్రుకలు పల్చబడి బట్టతల వచ్చేసిందిగానీ దాన్ని కూడా చేతల్లో ఉన్నంతవరకూ అందంగానే పెట్టుకుంటా ఉంటాడాయన.

ఏమీ తోచకపోతే, అనుకోని ఉపద్రవం ఊడిపడితే ఆయనకు ఆ బట్టతలే దిక్కు. అందులో చెయ్యి పెట్టి గీరుకుంటా ఉంటాడు.

ఇప్పుడు కూడా కాసేపు బట్టతల గీరుకొని, కళ్లద్దాలు తీసి మళ్లా పెట్టుకొని తీసి మళ్లా పెట్టుకొని అలవాటు ప్రకారం 'ఊ' అన్నాడు ఇంకేమి అనాలో తెలియక.

'ఏమి ఊ అయ్యా. ఏమి ఊ? ఈడొక్కడే ఈ పని చేశాడా అంటే అదీలా. యింటికొచ్చి పోలేరమ్మబండకాడున్న పిలకాయలకు కూడా చెప్పాడు. ఆ మాటను సాకలోళ్ల పిలకా యలు ఇద్దరు నమ్మి రాత్రంగా ముక్కుగీరుకున్నారంట. వాళ్ల ముక్కులు యింత లావు పొంగిపొయ్యి వాళ్ల అమ్మానాయనలు లబోదిబో. పొద్దున్నే మా యింటి మీదికి వచ్చి పంతులుగారూ.... మీ మనవడు చెప్పబట్టి గదా మా పిలకాయలకు యీ బాద. మొక్కు గట్టుకొని, పదహారుసార్లు కాలినడకన కొండెక్కి దిగినా ఆ దయగల ఎంకటేశ్వరసామి కలలోకి కూడా రాడే. అట్టాంటిది ముక్కుగీరుకుంటే నేరుగా ఎట్టా అవుపిస్తాడు. ఇయి ఏం

మాటలు, ఇయి ఏం పనులు అని నాతో తకరారు' అన్నాడు మురళీవాళ్ల తాత.

ఇంకప్పుడు కుమారస్వామి ఐవోరు లేచి నిలబడి, ఆయన టేబిలు మీద గ్లోబు పక్కన సిద్ధంగా పెట్టుకొని ఉండే వెదురు బెత్తాన్ని చేతుల్లోకి తీసుకొని 'మీరు పదండి ఆచారి గారు. నేను కనుక్కుంటా దీని సంగతి. మీరుంటే బాగుండదుగానీ పదండి' అన్నాడు.

మురళీవాళ్ల తాత పోతా పోతా కుమారస్వామి ఐవోరిని పక్కకు పిలిచి లోగొంతుకతో 'ఇదిగో. నువు మళ్లీ కొట్టేవు. పొద్దున్నే రెండు పీకా వాడిని. బెదిరిపోయున్నాడు బిడ్డ. నువు కూడా కొట్టబాక. మంచిమాటలతో బయం పెట్టు' అని చొక్కాలేని ఒంటి మీద తెల్ల కండువా కప్పుకుంటా ఎళ్లిపోయినాడు.

ఆయన్నట్టా పోనిచ్చి, బెత్తం ముకాన ఆడిస్తా 'ఊ. ఇప్పుడు చెప్పు నాయనా. ఎవురు నీకీ అయిడియా చెప్పిన ముండమోపి వెదవ' అన్నాడు కుమారస్వామి ఐవోరు.

పాపం. అప్పటికే మురళీగాడికి ఏడుపు వచ్చేసింది.

'సార్. నాకేం తెలియదుసార్. ఈ ఐడియా చెప్పింది అలహరి శ్రీనుగాడు సార్' అన్నాడు.

'ఏడ్రావాడు?' అన్నాడు కుమారస్వామి ఐవోరు.

అప్పుడే అలహరిశ్రీనుగాడు దూరంగా ఒక చేత్తో పుస్తకాలు పట్టుకొని, ఇంకో చేత్తో ముక్కు మూసుకొని వస్తా అవుపించాడు.

'పట్టకరండిరా వాణ్ణి' అనేసరికి, పిలకాయల లగెత్తుతా పోయి వాణ్ణి పట్టుకొని వచ్చారు.

కుమారస్వామి ఐవోరిని చూసేసరికి వాడికి కింది ప్రాణాలు కిందే పోయినట్టున్నాయి ముక్కు మీద చేతిని ఇంకాస్త అదిమిపెట్టాడు. వాడు లోపలికి రావడంతోటే ఆ చేతి మీద పెటీమనీ ఒక్కటేశాడు కుమారస్వామి ఐవోరు.

'ఇస్ అబ్బా' అంటా వాడు చేయి తీసేశాడు.

ముక్కు మీద ఎర్రగా తొక్క లేచిపోయుంది.

'ఏం పనులురా ఇయి? ఇంకా ఎవరెవరికి ఈ మాట చెప్పావురా నువ్వు?' అని పెటీ పెటీమని ఇంకో రెండు పీకాడు కుమారస్వామి ఐవోరు.

'ఇంకెవ్వరికీ చెప్పలేదుసార్. నేను చెప్పేటప్పుడు మాలకొండయ్యా, కదీరుగాడు ఉన్నారుసార్' అన్నాడు వాడు.

మేమిద్దరం హాజరు.

'సార్. వాడు చెప్పినమాట నిజం సార్. రాత్రి మూడుసార్లు గీరుకున్నాక ముక్కు మంట పుట్టి ఆపేశాను సార్. నాకు సుప్రబాతం కంటతా వచ్చుగాబట్టి ఆ దేవుడనేవాడు నిజంగా పరమాత్ముడే అయితే ఆ సుప్రబాతానికి నాకు కనిపించాలిగానీ యిట్టా నామం గీరుకున్నందుకాదు గదా అని ఆపేసినాను సార్. కావాలంటే నన్ను కొట్టండి సార్' అన్నాడు కందుల మాలకొండరావుగాడు ఎంతో నిజాయితీగా చెమటబట్టిన వాడి రెండు చేతులని ముందుకు సాచతా.

'సార్. నేను అలహరి శ్రీనుగాడి మాటలు యిని ఊరుకున్నానుగానీ అట్టాంటి పనేమీ చేయలేదు సార్. అప్పటికీ అన్నాను సార్. మనం ఇట్టాంటి పనులు చేయకూడదు. ఒకాల చెయ్యాలన్నా కుమారస్వామి ఐవోరికి ఒక మాట చెప్పాల అని చెప్పాను సార్' అన్నాను నేను ఎందుకైనా మంచిదని.

అంతా విని తనా మనా బేదం లేకుండా అందరినీ ఉతికి ఒదిలిపెట్టినాడు కుమార స్వామి ఐవోరు. ఆ తర్వాత నోటీసు బోర్డులో ఇట్టాంటి ముక్కు కతలు నమ్మవద్దని డీటైలుగా నోటీసు రాపిచ్చినాడు ఎస్‌డి సంతకంతో.

ఆ రోజు అందరం కుయ్యో మొర్రో అంటా ఇళ్లకు చేరినాం.

పాపం మురళీగాడికి మూడురోజులు జొరం కాసింది ఆ తర్వాత.

నేను వాళ్లింటికి చూడ్డానికి పోతే 'ఒరే. రాత్రంతా బలే జొరం కాసిందిరా. నిద్రలో ఎంకటేశ్వరసామి కనిపించినాడురా' అన్నాడు వాడు.

'అవునా? ఏమి అడిగావురా? ఏమి అడిగావు?' అన్నాను ఆత్రంగా.

'అదేరా. నేరుగా కనిపిస్తే అడగాలనుకున్నదే. మా తాతకు మా నాయన ఒక్కడే కొడుకు గదా. పాపం ఆయన మా కోసమని గుంటూరుకు పోయి ఉద్యోగం చేస్తా కష్టప డతా ఉన్నాడుగదా. ఆయనకు కూడా నేనొక్కణ్ణే గదా కొడుకుని. అందువల్ల నేను బాగా చదువుకొని పైకి రావాలని బాగా డబ్బు సంపాదించాలని హిరిప్లేన్లలో అట్టా ఇట్టా తిరగతా మా అమ్మానాయనలను సుకపెట్టాలని కోరుకున్నానురా' అన్నాడు వాడు.

'అంటే ఏమన్నాడురా దేవుడు' అన్నాను.

'ఆల్‌రైట్ అన్నాడురా' అన్నాడు మురళీగాడు.

'అబ్బ. నువు బలే లక్కీవిరా' అన్నాను వాడితో.

ఇది జరిగింది మా ఎయిత్ కిలాసులో. అంటే పందొమ్మిది వందల ఎనబై అయిదులో.

ఆ తర్వాత మురళీగాడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఎంకటేశ్వరస్వామి కలలో ఆల్‌రైట్ అన్నట్టే పెద్ద చదువులు చదివినాడు. హిరిప్లేన్లలో అట్టా యిట్టా తిరిగినాడు. వాళ్ల అమ్మా నాయనలను సుకపెట్టినాడు. ఇప్పుడు లండన్‌కాడ షెఫీల్డ్‌లో హెచ్‌ఎఫ్‌డిసి బ్యాంకీలో పని చేస్తా ఉన్నాడు.

అయితే ఒకటి.

ఎంత చేసినా ఏమి చేసినా వాడి ముక్కు మీద ఆ నిలువు నామం మచ్చ మాత్రం పోలా. అట్టాగే ఉంది ఇప్పటికీ.

■